క్లుప్తంగా

సరుకుల పంపిణీ



కాటారం: మండలంలోని శంకరాంపల్లికి చెందిన భూపెల్లి దుర్గమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ అంగజాల అశోక్‌కుమార్ సోమవారం పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రజావాణికి దరఖాస్తులు



కాటారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా తొమ్మిది దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. సమస్యలపై విచారణ చేసి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

టేకుమట్ల: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న, మిరప పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేందర్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. వడగళ్ల వానతో వరి, మామిడి రైతులు ఎంతో నష్టపోయారని అన్నారు. వర్షాల అనంతరం పంటలను పర్యవేక్షించకుండానే ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రైతులకు కంటితుడుపు మాటలను చెప్పాడే తప్ప ప్రభుత్వం నుంచి రూపాయి సాయాన్ని కూడా ఇప్పించలేదని మండిపడ్డారు.

సామగ్రి వేలం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలోని పాత ఇనుప, ఇత్తడి సామగ్రి బహిరంగ వేలం పాటను ఈఓ మహేష్ సోమవారం కార్యాలయంలో నిర్వహించారు. వేలం పాటలో రూ.29కి కిలో చొప్పున ఇనుప సామాను, రూ.466 కిలో చొప్పున ఇత్తడి సామానులు హెచ్చుపాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రేగొండ: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగపూరి లింగయ్య సోమవారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా కాలుజారి కింద పడిపోయాడు. దీంతో ఆయన ఎడమ కాలు విరగడంతోపాటు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన లింగయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, గౌడ కులస్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడి మృతి



దేవదాసు(ఫైల్)

చిట్యాల: మండలంలోని అందుకుతండా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోయిని దేవదాసు (38) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య సృజన, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

చిన్నతరహా వ్యాపారానికి ముద్ర లోన్లు
- సహకారం అందిస్తున్న బ్యాంకులు
- సద్వినియోగం చేసుకుంటున్న చిరు వ్యాపారులు



టేకుమట్ల: ఆర్థిక సుస్థిరత సాధించేందుకు ప్రతీ ఒక్కరు ప్రయత్నాలు చేస్తుంటారు. వారికి ఆర్థికంగా కొంత తోడ్పాటునందిస్తే వ్యాపార పరంగా కొంత ముందుకు సాగుతూ ఎదిగే అవకాశం ఉంటుంది. వ్యవసాయానికి అనుబంధంగా ఉండే కోళ్ల పరిశ్రమ, చేపల పెంపకం వంటి వాటితో పాటు, చిన్న తయారు యూనిట్లు, సర్వీస్ సెక్టార్ యూనిట్లు, దుకాణా వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకులు ముద్ర లోన్లు అందిస్తాయి. అలాగే టైలరింగ్, బ్యూటీ పార్లర్లు నిర్వహించుకునేందుకు, ట్రక్ ఆపరేటర్లు, క్యాబ్, ఆటోడ్రైవర్లు, రిపేర్ షాపులు, మెషిన్ ఆపరేటర్లు, చేతి వృత్తుల పరిశ్రమలకు పరికరాల కొనుగోలు, వాణిజ్య రవాణా వాహనాల కొనుగోలు వంటి అవసరాలకు ముద్ర రుణాలు అందిస్తారు. ఇలా ఉపాధి అవకాశాల కోసం ముద్రలోన్‌లను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగవచ్చు.

ముద్ర లోన్‌కు నిబంధనలు

60 సంవత్సరాల లోపు ఉన్న వారై ఉండాలి. గతంలో ఏ బ్యాంకులోనైనా మొండి బకాయిలు ఉంటే లోన్ పొందడానికి బ్యాంకర్లు అనర్హులుగా పరిగణిస్తారు. రుణాలు ఇచ్చే ముందు వారి సిబిల్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకుంటారు.

ముద్ర లోన్‌లో పొందే రుణం

ముద్ర పథకంలో నాలుగు రకాల రుణాలను బ్యాంకర్లు అందజేస్తారు. వ్యాపార అవసరం మేరకు లోన్లు ఎన్నుకోవచ్చు. శిశులోన్‌లో రూ.50వేల వరకు రుణం అందిస్తారు. ఈ లోన్ కొత్తగా వ్యాపారం ప్రారంభించుకునే వారికి, చిన్న అవసరాల వారికి ఉపయోగపడుతుంది. శిశులోన్ రుణాలకు 1 నుంచి 12శాతం వరకు వడ్డీ రేట్లు ఉంటాయి. అలాగే కిశోర్ లోన్లు రూ. 50వేల నుంచి రూ.5లక్షల వరకు అందిస్తారు. ఇది వ్యాపారాన్ని స్థాపించి మరింత అభివృద్ధి చేయాలనుకునే వారికి ఉపయోగపడుతుంది. రుణాల వడ్డీ శాతం 8.6 నుంచి ప్రారంభం అవుతుంది. అదేవిధంగా తరుణ్ లోన్‌లో రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఉంటుంది. ఇది స్థిరపడిన వ్యాపారాలను విస్తరించుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ రుణాల వడ్డీ శాతం 11.15 నుంచి 20శాతం వరకు ఉంటుంది. అలాగే తరుణ్ ప్లస్ లోన్‌లో రూ.10లక్షల నుంచి రూ. 20లక్షల వరకు లోన్లు అందిస్తారు.

ముద్ర లోన్‌తో ప్రయోజనాలు

ముద్రాలోన్‌లకు ఎలాంటి హామీ, రుణ గ్రహీతలు పూచీకత్తు ఇవ్వాల్సిన అవసరం లేదు. చిరు వ్యాపారులకు కొన్ని బ్యాంక్‌లు రుణాలను ఇవ్వకపోతే ముద్రలోన్‌లను తీసుకుని ఆర్థికంగా ఎదగవచ్చు. అందుబాటులో ఉండే వడ్డీ రేట్లు, ముద్రా రుణాల తిరిగి చెల్లింపులు వ్యాపారాల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు. మహిళా పారిశ్రామిక వేత్తలను పోత్సహించేందుకు వడ్డీ రేట్లలో రాయితీ కల్పిస్తున్నారు. ఇలా బ్యాంక్‌ల్లో ముద్రలోన్‌లతో ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది కావున అర్హులందరూ సద్వినియోగం చేసుకుంటే కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుంది.

మూడు సార్లు లోన్ తీసుకున్నా..



ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకునేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.50వేల ముద్రాలోన్ తీసుకున్నా. లోన్ పూర్తి అయ్యాక మళ్లీ రూ.75వేలు తీసుకున్నా. ఫొటో స్టూడియోను మరింత మెరుగు పరిచేందుకు మూడోసారి రూ.లక్షా 50వేలను తీసుకున్నా. ఎవరినీ డబ్బులు అడగకుండా నేరుగా బ్యాంక్‌లో లోన్ తీసుకునేందుకు ముద్రలోన్ పథకం ఎంతగానో ఉపయోగపడింది.

– నిమ్మల దేవేందర్, ఫొటో గ్రాఫర్, టేకుమట్ల

వాయిదాలు చెల్లిస్తున్నా..



మండల కేంద్రంలో బేకరీ నడుపుకుంటున్న నాకు డబ్బులు అవసరం రావడంతో యూనియన్ బ్యాంక్‌లో గత సంవత్సరం రూ.50వేల ముద్రాలోన్ తీసుకున్న. ఇంకా లోన్ గడువు తీరలేదు. లోన్ గడువు తీరగానే మళ్లీ లోన్ తీసుకుంటా. వ్యాపారంలో రోజువారిగా కొంత నగదును కూడబెట్టి నెలసరి వాయిదాలు చెల్లిస్తున్నా. నాకు ఆర్థికంగా ముద్ర లోన్ తోడుగా నిలిచినట్లు అనిపించింది.

– మాట్ల శ్రీనివాస్, టేకుమట్ల

సభ సక్సెస్‌తో కాంగ్రెస్ నాయకుల్లో వణుకు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: హనుమకొండలోని ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వణుకు పుట్టిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజతోత్సవ బహిరంగ సభకు అనుకున్న జనాభా కంటే అధికంగా తరలివచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆవేశంతో ఉన్నారన్నారు. సభ సక్సెస్ కాకుండా ప్రభుత్వం, పోలీసులు కుట్రలు చేసినట్లు ఆరోపించారు. ట్రాఫిక్ నియంత్రించకుండా, సభ స్థలికి చేరకుండా బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అడ్డుపడినట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి సభకు అధిక సంఖ్యలో కార్యకర్తల నాయకులు తరలివచ్చి విజయవంతం చేసేందుకు కతజ్ఞతలు తెలిపారు. జనార్ధన్, మేకల సంపత్, నరసింగరావు, హరీష్ రెడ్డి, రవి, బిబి చారి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి : యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని దుకాణాల్లో గంజాయి లాంటి మత్తుపదార్థాలను గుర్తించేందుకు స్నీపర్ డాగ్‌తో సోమవారం ఎస్సై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్తుపదార్థాలు విక్రయించినట్లయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమతి లేని మత్తు పదార్థాలను విక్రయించినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఏటూరునాగారం : స్థానిక ప్రభుత్వ మహిళా గురుకుల గిరిజన డిగ్రీ కళాశాలలో ఆడ్మిషన్ల కో సం మే 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీవాణి తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న బీఎస్సీ, బీజెడ్‌సీ, ఎంపీసీఎస్ ఎంపీసీ బీఏ(హెచ్ఇపీ), బీ కాం (జనరల్), బీకాం (సీఏ), ఎంబీజెడ్‌సీ గ్రూపుల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చే సుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్ అవకాశాలతో పాటు విద్యాకోర్సులు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మ రింత సమాచారం కోసం 8332864686, 944188 4065 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కన్నాయిగూడెం : మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు జై భీమ్, జైబాపు, జై సంవిధాన్, అంటూ బుట్టాయిగూడెంలో మండల అధ్యక్షుడు అప్సర్ పాషా ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ అవలంభిస్తున్న పోకడలను కార్యకర్తలు ఖండించాలన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, తాటి రాజబాబు, నాగేష్, కుమార్, బైరేష్, సుధాకర్, సత్యం పాపయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



చిట్యాల: ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు



రేగొండలో..

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన జిల్లెల కుమార్, వెంకట్రావుపల్లి (సి) గ్రామానికి చెందిన ఎండీ.మునీర్ ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందాడు. దీంతో వారితో కలిసి చదువుకున్న 1996–97 పదో తరగతి బ్యాచ్ మిత్రులు బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.40వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాలవేని శ్రీనివాస్, లాండే శివాజీ, ఆరెపల్లి సమ్మయ్య, దేవా శ్రీధర్, పెరుమాండ్ల రవీందర్, సతీష్, వేణు, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తాళ్ల రవీందర్ తండ్రి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి ఆటో యూనియన్ సభ్యులు పరామర్శించి, రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పోతిరెడ్డి సాంబయ్య, ఉపాధ్యక్షుడు బొంగు భిక్షపతి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రొయ్యూర్‌లో..

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన డొంగిరి రాజేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు సహకారంతో స్థానిక నాయకుల చేతుల మీదుగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో జిట్ట ఈశ్వర్, డొంగిరి లక్ష్మణ్, గజ్జల ప్రకాష్, దుర్గం లక్ష్మణ్, సంద శ్రీనివాస్, ఆకుదారి అన్నమయ్య, సోదారి చిన్ని, మల్లయ్య, సోదారి ఎల్లయ్య ఉన్నారు.

సహకార సంఘాలతో రుణ సౌకర్యం



మల్హర్: ర్యాలీ నిర్వహిస్తున్న సొసైటీ సిబ్బంది



కాటారంలో..



రేగొండలో..



భూపాలపల్లి రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది, రైతులు

- పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్

భూపాలపల్లి రూరల్: సహకార సంఘాల ఏర్పాటు వచ్చిందని జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ సహకార సంఘ సంవత్సరం సందర్భంగా జిల్లా కేంద్రంలో సహకార సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య అన్నారు. ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరాన్ని సహకార సంవత్సరంగా గుర్తించిన సందర్భంగా సోమవారం తాడిచర్ల సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సమాజాభివృద్ధికి సహకార వ్యవస్థ ఎంతో కృషి చేస్తుందన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్‌రావు, డైరెక్టర్లు సంగెం రమేశ్, తిరుపతిరావు, మాచేర్ల సురేశ్, బానోతు సర్వనాయక్, సుంకు రామన్న, కేడీసీసీ మేనేజర్, వెంకటరాజం, సీఈఓ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం: అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా మహాముత్తారం మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది మండల కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని తెలిపారు. పీఏసీఎస్ పాలకవర్గం సభ్యులు చిన్నరాజయ్య, సుజాత, సమ్మక్క, జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రిలీఫ్‌రెడ్డి, సీఈఓ శ్రీధర్, సంఘం సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేగొండ: అంతర్జాతీయ సహకార ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారి శ్రావణ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. సహకార సంఘం నుంచి రైతులకు రుణం, విత్తనాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వాల నుంచి వచ్చే నూతన వ్యవసాయ విధానాన్ని సహకార సంఘం నుంచి అందజేస్తామన్నారు. సీఈఓ జగన్, సిబ్బంది సంతోష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా దశరథ



నియామక పత్రం అందజేస్తున్న సమ్మయ్య

భూపాలపల్లి అర్బన్: భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మేకల దశరథను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయనకు జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందజేశారు. భూమాత రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో పోరాటాల నిర్వహించనున్నట్లు సమ్మయ్య యాదవ్ తెలిపారు.

అక్రమంగా మొరం దందా..

- వాహనాలను స్టేషన్‌కు తరలించిన పోలీసులు



టిప్పర్‌లో మొరం నింపుతున్న పొక్లెయినర్

వాజేడు : అనుమతులు లేకుండా అక్రమంగా మొరం దందా కొనసాగుతోంది. మండలంలోని టేకులగూడెం గ్రామ సమీపంలో ఇసుక క్వారీ మంజూరైంది. ఇసుక తరలించడానికి సదరు కాంట్రాక్టర్ రాత్రి, పగలు తేడా లేకుండా రహదారిని నిర్మించాడు. ఈ విషయంపై స్థానిక ప్రజలు ఒకసారి రహదారి పనులను నిలిపివేశారు. అయినప్పటికీ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అనుమతులు లేకున్నా అనుమతులు ఉన్నట్లు ప్రచారం సాగిస్తూ గ్రావెల్ తరలిస్తుండటంతో విషయం అధికారులకు తెలిసింది. గ్రావెల్ తరలించే ప్రాంతానికి వెళ్లిన రెవెన్యూ సిబ్బంది, పోలీసులు వాహనాలను పేరూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చట్టాలను పట్టించుకోకుండా అక్రమంగా గ్రావెల్ తరలించడంపై పలు విమర్శలు వ్యక్త మౌతున్నాయి.

నాసిరకంగా టైల్స్ పనులు

- పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్



భూమిలో డ్రెయినేజీ పక్కన పోసిన మట్టి



టైల్స్ అంచున ఊడిపోతున్న సిమెంట్

ఎస్ఎస్‌తాడ్వాయి : మండల కేంద్రంలో జాతీయ రహదారి విస్తీర్ణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించారు. డ్రెయినేజీ స్లాబ్‌పై వేస్తున్న టైల్స్ పనులు నాసిరకంగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు విస్తీర్ణం పనులు మొదటి నుంచి కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నా ఎన్‌హెచ్ ఇంజనీరింగ్ ఉన్నాతాధికారులు మాత్రం పట్టింపు లేనట్లుగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ఇంజనీరింగ్ అధికారులను సంబంధిత కాంట్రాక్టర్ మచ్చిక చేసుకోవడంతోనే పనులు ఇష్టారీతిన చేపట్టినా పట్టించుకున్న నాథుడే లేరని స్థానిక ప్రజలు ఆరోస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పనులు

రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం పనులు నిబంధనలు విరుద్ధంగా అడ్డదిడ్డంగా పనులు చేస్తున్నా ప్రశ్నించే వారే కరువయ్యారు. డ్రెయినేజీ స్లాబ్‌పై డిజైన్ కోసం టైల్స్ వేస్తున్నారు. పనుల్లో సీసీ స్లాబ్‌పై ఇసుక సిమెంట్ వేసి టైల్స్ అమర్చాల్సి ఉంది. సిమెంట్ తక్కువగా వేసి ఎక్కువ మొత్తంగా ఇసుక పోసి టైల్స్ వేస్తున్నారు. టైల్స్ సమానంగా వేయాల్సి ఉండగా అక్కడక్కడ హెచ్చుతగ్గులుగా కనిపిస్తుంది. అంతేకాకుండా టైల్స్ వేసిన తర్వాత స్లాబ్ అంచును టైల్స్ లేవకుండా ఉండేందుకు సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేస్తున్నా సిమెంట్ తక్కుగా వాడడంతో వేసిన గంటల వ్యవధిలోనే ఎండకు సిమెంట్ ఆరిపోయి ఊడిపోతుంది. కనీసం క్యూరింగ్ కూడా చేయడం లేదు. కాంట్రాక్టర్ తరుపున పనులు చేయిస్తున్న సూపర్‌వైజర్లు ఇష్టారాజ్యంగా పనులు చేయిస్తున్నారనే విమర్శలు వస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు మచ్చుకైనా పనుల పర్యవేక్షించిన దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మురుగు వస్తుంది..



తాడ్వాయి మసీదు సమీపంలో రోడ్డు పక్కన నాకు భూమి ఉంది. డ్రెయినేజీ నిర్మాణం చేశారు. డ్రెయినేజీ సైడ్‌వాల్ పగిలిపోయి మురుగు నా భూమిలోకి వస్తుంది. మరమ్మతులు చేస్తామని చెప్పారు. చేయకుండా తప్పును కప్పిపుచ్చుకునేందుకు డ్రెయినేజీ పక్కన భారీగా మట్టిపోయడంతో సుమారు గుంట భూమి కోల్పోయాను.

– కొత్తపేట శ్రీరాములు, తాడ్వాయి

సీఐని కలిసిన నాయకులు



సీఐని సన్మానిస్తున్న నాయకులు

ములుగు : ములుగు సీఐగా బాధ్యతలు చేపట్టిన సురేశ్‌ను సోమవారం ప్రజా సంఘాల నాయకులు తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక సమస్యలపై చర్చించారు. సీఐని కలిసిన వారిలో తెలంగాణ ప్రజాసేనా వ్యవస్థాపకుడు బొమ్మకంటి రమేశ్‌వర్మ, కాంగ్రెస్ నాయకుడు బొచ్చు సమ్మయ్య, నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నక్క రాజు, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కలువల రవీందర్, ఎమ్మార్పీస్ నాయకుడు అశోక్, కర్రి దినకర్, జనార్ధన్, చిన్న అశోక్ పాల్గొన్నారు.